క్లుప్తంగా

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికెట్లను చూపుతున్న విద్యార్థులు

హిందూపురం: స్థానిక ఎంజీఎం హైస్కూల్‌లో ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ పరీక్షలను ఆదివారం నిర్వహించినట్లు అసోసియేషన్ గ్రాండ్ మాస్టర్ రామచంద్ర తెలిపారు. కరాటే బెల్ట్ పరీక్ష పోటీల్లో అసోసియేషన్ కరాటే విద్యార్థులు 35 మంది పాల్గొన్నారన్నారు. ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, పర్పుల్, బ్రౌన్‌బెల్ట్‌లను సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ శిక్షకులు మహేంద్ర, శివకుమార్, ప్రజ్వల్, వేణు, హర్షవర్ధన్, తేజ, వస్నూరుస్వామి తదితరులు పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేసి అభినందించారు.

మాదిగలు అన్ని రంగాల్లో రాణించాలి

పెనుకొండ: మాదిగ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని మాదిగ కుల పెద్దలు, ఉద్యోగులు పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని ఓ రిసార్ట్‌లో ఆదివారం మాదిగ కులస్తుల 9వ వార్షికోత్సవ ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి పలు ప్రాంతాల నుంచి మాదిగలు ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాదిగలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని నాయకులు పోతులయ్య, ఉలవల నాగరాజు, హైకోర్ట్ న్యాయవాది శివరామకృష్ణ, ప్రముఖ కవి ఆశావాది తనయుడు సుధామ కీర్తి, సతీష్ కుమార్ తదితరులు తెలియజేశారు.

కారు - ద్విచక్ర వాహనం ఢీ



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

అగళి: మండల కేంద్రంలోని జాతీయ రహదారి కూడలిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకెళితే.. అగళి మండలం హనుమనపల్లికి చెందిన బాలకృష్ణ ద్విచక్ర వాహనంపై అగళి నుంచి మాధుడి గ్రామం వైపు వెళ్తున్నాడు. అగళి హైవే కూడలి సమీపంలో కర్ణాటక రాష్ట్రం టిప్పటూరుకు చెందిన కిరణ్ కుటుంబ సభ్యులు పని నిమిత్తం కారులో నీలకంఠపురానికి వచ్చి తిరిగి వెళ్తున్నారు. ఈ సమయంలో కారు, ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన బాలకృష్ణను బెంగళూరుకు తరలించారు. పోలీసులు కారు డ్రైవర్ రమేష్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అగళి సంతకు పూర్వ వైభవం



సంతను ప్రారంభిస్తున్న పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్

అగళి: కోవిడ్ కారణాల రీత్యా నిలిచిపోయిన అగళి సంత ఆదివారం పూర్వ వైభవం సంతరించుకుంది. అధిక సంఖ్యలో వర్తకులు వచ్చి అంగళ్లను ఏర్పాటు చేసుకోవడంతో చుట్టు పక్క గ్రామాల ప్రజలు వచ్చి కూరగాయలు, ఇంటి సరుకులను కొనుగోలు చేశారు. రైతులు, వ్యాపారస్తులు, మేక, గొర్రె పశువుల సంతలో లావాదేవీలు జరుపుకున్నారు. ప్రతి ఆదివారం వ్యాపర్తులు, ప్రజలు సంతలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచు లక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శి రంగనాథ్ సూచించారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన సూర్య విద్యానికేతన్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: స్వాతంత్ర సమర యోధుడు, మాజీ ఎంపీ దివంగత శ్రీరామిరెడ్డిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని విద్యతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ డిపాట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ సత్యవతి కోరారు. మండలంలోని నీలకంఠాపురంలో ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆదివారం మాజీ మంత్రి రఘువీరారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామిరెడ్డి 119వ జయంతి వేడుకలకు సత్యవతితో పాటు మధుగిరి సబ్ కలెక్టర్ శివప్ప అతిథులుగా పాల్గొన్నారు. అంతకు ముందు శ్రీరామిరెడ్డి సమాధి వద్ద రఘువీర కుటుంబ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ తదితరులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం క్రికెట్ పోటీల్లో విజేతలతో పాటు పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన వారికి బహుమతులు అందించారు.

నిత్యావసరాలకో, కాయగూరలకో సంచి పట్టుకుని సంతకెళితే.. గుండెలు బరువెక్కకుండా ఇంటికొస్తామన్న గ్యారంటీ లేకుండా పోతోంది. కొండెక్కిన నిత్యావసర ధరలు సామాన్యులు, మధ్య తరగతి ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. వంట నూనెలు భగ్గుమంటుంటే.. కూరగాయల ధరలు కొత్త రికార్డులు క్రియేట్ చేస్తున్నాయి. కొత్తిమీర కొనాలన్నా యాభైనోటు బైటికి తియ్యాల్సిన పరిస్థితి.

ధరల దడ



- కొండెక్కిన నిత్యావసరాలు, కూరగాయల ధరలు
- ఏం కొనేట్టు లేవంటున్న ప్రజలు
- పండుగ పూట కూడా పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన
- ధరల నియంత్రణను పట్టించుకోని ప్రభుత్వాలు

పెనుకొండ రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం సామాన్య, మధ్యతరగతి ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. నోటికి రుచిగా ఏదైనా తిందామన్నా ఇంట్లో పొయ్యి వెలగనంటోంది. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్న కూటమి నేతల హామీ నీటి మీద రాతలే అయ్యాయి. కందిపప్పు కొండెక్కింది.. వంట నూనెలు సల సల కాగిపోతున్నాయి. కూరగాయలు ముట్టుకుంటే భగ్గుమంటున్నాయి. వచ్చే ఆదాయం కంటే ఖర్చులే అధికమయ్యాయి. గతంలో ఎన్నడూలేని విధంగా నిత్యావసరాలు, కూరగాయల ధరలు భారీగా పెరిగాయి.

ఆకాన్నంటిన ధరలు

కిలో కంది పప్పు 160, కిలో ఎండు మిర్చి రూ. 240, తెల్లగడ్డలు రూ.360, చింత పండు రూ.160 ఇలా నిత్యావసర సరుకుల ధరలన్నింటికీ రెక్కలు వచ్చాయి. ఇక ఉల్లిగడ్డలు, టమాట తదితరాలు కూడా ప్రజలకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. టమాట కేజీ రూ.60కి పైగానే పలుకుతున్నాయి. ఉల్లిగడ్డలు కూడా కేజీ రూ.60 దాటి చాలా రోజులైంది. మిగతా కూరగాయలు ఇదే పద్ధతిలో రేట్లు పెరిగిపోయాయి. ఏ కూరగాయ కొనాలన్నా కేజీకి రూ.40కి పైగానే పెట్టాల్సి వస్తోంది. ఆకుకూరలు సైతం అందలం ఎక్కాయి.

ఒకే నెలలో రెండు సార్లు పెరిగిన నూనె ధర

వంట నూనెల ధరలకు రెక్కలు వస్తున్నాయి ఒకే నెలలో రెండు సార్లు నూనె ధరలు పెరిగాయి. గత నెల 15వ తేదీ వరకూ కిలో రూ.115గా ఉన్న సన్‌ఫ్లవర్ ఆయిల్ ఒక్కసారిగా రూ.135కు చేరింది. వంద రూపాయలు ఉన్న పామాయిల్ ధర 15వ తేదీ నుంచి రూ. 125 అయింది. పెరిగిన ధరలకు అదనంగా ప్రస్తుతం 5 శాతం ధరలు మళ్లీ పెరిగినట్లు వ్యాపారస్తులు చెబుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో అండగా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సామాన్యులకు అండగా నిలిచింది. క్రమం తప్పకుండా ఆర్థిక తోడ్పాటు ఇచ్చేది. సంక్షేమ పథకాలు ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ చేసేది. తద్వార నిత్యావసర ధరలు అదుపు తప్పినా సామాన్యులు జీవనానికి ఎలాంటి ఢోకా లేకుండా సాఫీగా సాగేది.

పట్టించుకోని ప్రభుత్వాలు

నిత్యావసరాలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నా ధరల నియంత్రణ లేకుండా పోయింది. పండిస్తున్న రైతుకు గిట్టుబాటు ధరలు లేక పోగా మార్కెట్లో దళారులు రాజ్యమేలుతున్నారు. రిటైల్ వ్యాపారస్తులు ధనార్జనే ధ్యేయంగా సొమ్ము చేసుకుంటున్నారు. ధరల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ మాత్రం చర్యలు తీసుకోకపోవడంపై అన్ని వర్గాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయల ధరలు ఇలా (కేజీ)...

ఉల్లిగడ్డ	రూ.60
పచ్చిమిర్చి	రూ.60
టమాట	రూ.60
ఉర్లగడ్డలు	రూ.60
క్యారెట్	రూ.60
బీన్స్	రూ.120
ముల్లంగి	రూ.40
చిక్కుడుకాయ	రూ.40
వంకాయ	రూ.40

నిత్యావసరాల ధరలు ఇలా...

వంట సరుకు పేరు	కిలో ధర
కొబ్బరి	రూ.200
ఎండు మిర్చి	రూ.250
చెనిగిత్తనాలు	రూ.130
తెల్లగడ్డలు	రూ.320 -360
పప్పులు	రూ.120
శనిగబేడలు	రూ.110
కంది బేడలు	రూ.160-170
కారం పొడి	రూ.250
పామాయిల్ (లీటర్)	రూ.130
చింతపండు	రూ.160
ఉద్దిబేడలు	రూ.140



పండగ పూట ఏం తినాలి?



మధ్య తరగతి, సామన్య ప్రజలను దృష్టిలో ఉంచుకొని నిత్యావసరాల ధరల నియంత్రణకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఎన్నిక ప్రచారంలో ఇచ్చిన హమీల్లో ధరల నియంత్రణ కూడా భాగమే. పెరిగిన ధరలు సామాన్యుని నడ్డి విరిచేలా ఉన్నాయి. పండగ పూట పేద మధ్యతరగతి ప్రజలు పస్తులుండేలా ధరలు పెరిగితే ఎలా?

– ప్రకాశ్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు

ధరల నియంత్రణ పట్టదా?



కూటమి ప్రభుత్వం ఎన్నికల హమీలలో ఇచ్చిన వాగ్దానాల్లో ధరల నియంత్రణ భాగమే. ప్రభుత్వం ధరలను నియంత్రించి పేద, మధ్య తరగతి కుటుంబాలకు అండగా నిలవాలి. పండగ పూట సామాన్య ప్రజలు నిత్యావసర సరుకులు కొనలేని పరిస్థితి. ఇప్పటికే ధరలను నియంత్రించాలి. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హమీలు కేవలం సూపర్ సిక్స్ మాత్రమే కాకుండా, వాటికి అనుబంధంగా ఇచ్చిన 21 హమీలను నెరవేర్చాలి.

–హరి సిపిఎం డివిజన్ కార్యదర్శి

ధరలు మండిపోతున్నాయి



నేను ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాను. మా జీతాల పెరుగుదల అయితే లేదు గాని నిత్యావసరాలు, కూరగాయల ధరలు మాత్రం మండిపోతున్నాయి. చాలీచాలని జీతంతో జీవితం సాగదీయాలంటే పేద, మధ్య తరగతి కుటుంబాల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. కూటమి ప్రభుత్వం ధరలను నియంత్రించి సామాన్యులకు ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– తిరుపాల్‌నాయక్, శెట్టిపల్లి

పార్టీ మారిన కౌన్సిలర్లకు షోకాజ్ నోటీసులు



ఈరలక్కప్పకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: నియోజకవర్గంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తప్పవని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప స్పష్టం చేశారు. ఎంతటివారైనా సరే పార్టీకి నష్టం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలోని మున్సిపల్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి ఇంట్లో ఆదివారం పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో పార్టీ మారిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు ఈరలక్కప్పకు వినతిపత్రం అందించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ కొంత మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఇటీవలనే టీడీపీలో చేరారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులు కోరుతున్నారని, తప్పకుండా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వారికి త్వరలోనే వీరికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే పార్టీ మారిన కౌన్సిలర్ల వ్యవహారాన్ని జిల్లా అధ్యక్షురాలి దృష్టికి కూడా తీసుకెళ్ళినట్లు తెలిపారు. పార్టీ పెద్దలు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి కూడా ఈవిషయాన్ని తీసుకెళ్తామన్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పదవులను పొందిన నాయకులు ఈరోజు పార్టీకి ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. భవిష్యత్ వైఎస్సార్‌సీపీదేనని, వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. నాయకులు, కార్యకర్తలకు మంచి రోజులొస్తాయని, పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేయాలని కోరారు. ఇదిలా ఉండగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీచరణ్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కూడా పార్టీ మారిన కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రాలను పంపారు. పార్టీ మారిన కౌన్సిలర్లు సుధాకర్‌నాయక్, లక్ష్మయ్య, పార్వతమ్మ, సుజాత, వెంకటలక్ష్మమ్మ, సావిత్రమ్మలపై చర్యలు తీసుకోవాలని పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు వినతి పత్రంలో పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ తనయుడు జయరాజ్, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, కౌన్సిలర్లు విక్రమ్, నాగేంద్ర, శ్రీనివాసులు, అన్సర్, కోఆప్షన్ మెంబర్ కృష్ణమూర్తి, పట్టణ నాయకులు రాజేష్, గోపి, సైపుల్లా పాల్గొన్నారు.

పెద్ద వెంకటరెడ్డి మృతికి నివాళి



పెద్ద వెంకటరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న చరణ్‌రెడ్డి

గోరంట్ల: మండల పరిధిలోని గుమ్మయ్యగారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మదన్ మోహన్‌రెడ్డి తండ్రి కోర్టు పెద్దవెంకటరెడ్డి ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఉషశ్రీ భర్త చరణ్ రెడ్డితో నాయకులు గుమ్మయ్యగారిపల్లికి చేరుకొని పెద్దవెంకటరెడ్డి మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి , పట్టణ కన్వీనర్ మేదర శంకర్ , గోరంట్ల ఉప సర్పంచ్ రాజారెడ్డి, పార్టీ ముఖ్యనాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లు

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తక్షణ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేశవ రావు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ లేక తత్సమాన కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు సంబంధిత సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరై నేరుగా అడ్మిషన్లు పొందవచ్చన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గుడిబండ: మండల వ్యాప్తంగా ఉన్న పది మంది రౌడీ షీటర్లకు మడకశిర సీఐ రాజకుమార్ ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. గతాన్ని వీడి సత్ప్రవర్తనతో మెలగాలని, లేకపోతే తగిన చర్యలు తీసుకుని పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. రౌడీ షీటర్లపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. ఏఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరుస్తాం

పావగడ: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పట్టణంలో ఇళ్లు లేని నిరు పేదలకు ఇళ్లు నిర్మించి వారి సొంతింటి కలను త్వరలోనే సాకారం చేస్తామని స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ తెలిపారు. స్థానిక తుమకూరు రోడ్డులోని 114 సర్వే నంబరు ప్రభుత్వ భూమిలోని 5 ఎకరాల 35 కుంటల స్థలాన్ని ఎమ్మెల్యే వెంకటేశ్ ఆదివారం పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్, కౌన్సిలర్లు సుదేశ్ బాబు, టెంకాయల రవి, గొర్తి నాగరాజు, వెంకటరమణప్ప ఉన్నారు.

'పురం'పై నార్పల జట్టు గెలుపు



పరుగులు, 5 వికెట్లు తీసిన సంజయ్

హిందూపురం టౌన్: అనంతపురం ఏపీఎల్ (ఆర్‌డీటీ) గ్రామీణ క్రికెట్ లీగ్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆదివారం పట్టణంలోని ఎంజీఎం క్రీడామైదానంలో హిందూపురం టౌన్ జట్టుతో నార్పల జట్టు తలబడింది. మొదట బ్యాటింగ్ చేసిన నార్పల జట్టు నిర్ణీత 40 ఓవర్లలో 179 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన హిందూపురం జట్టు 172 పరుగులకు ఆలౌట్ అయింది. హిందూపురం జట్టుపై కే.సంజయ్ 51 పరుగులతో పాటు 5 వికెట్లు తీసి ఆల్ రౌండర్ ప్రతిభ కనబరిచినట్లు ఆర్డీటీ క్రికెట్ కోచ్ సల్మాన్ తెలిపారు.

ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం

పావగడ: పట్టణంలోని మధుగిరి ఊరువాకిలి కట్ట వద్ద స్థానిక విశ్వ హిందూ పరిషత్, బజరంగదళ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హిందూ మహాగణపతి విగ్రహాన్ని ఆదివారం నిమజ్జనం చేశారు. ఊరేగింపులో కన్నడ సాహిత్యంలో జ్ఞాన పీఠ అవార్డులు పొందిన ప్రముఖ సాహితీ వేత్తల చిత్ర పటాలను ప్రదర్శించారు. స్థానిక సీఐ సురేశ్ బందోబస్తును పర్యవేక్షించారు. పళవల్లి చెరువు కట్ట వద్ద విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

రాష్ట్ర డైరెక్టర్లుగా ఎన్నిక

అమరాపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వీరశైవ లింగాయతుల నూతన కార్యవర్గంలో మండలం నుంచి ముగ్గురికి చోటు దక్కింది. ఆర్.విశ్వేశ్వరబాబు, ఆర్.మంజునాథ, పీఎస్ మంజునాథలను ఏకగ్రీవంగా రాష్ట్ర డైరెక్టర్లుగా ఎంపిక చేశారు. ఉమ్మడి అనంతపురంలో జరిగిన రాష్ట్ర నూతన కార్యవర్గం సమావేశంలో నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చిలమత్తూరు: 'దృష్టి మరల్చి నగదు, ఆభరణాలు అపహరించే ముఠా జిల్లాలో సంచరిస్తోంది. సరిహద్దులో ఉన్న చిలమత్తూరులో సంచరించే అవకాశాలు ఉన్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి' అని ఎస్ఐ మునీర్ అహ్మద్ ప్రజలకు ఒక ప్రకటనలో సూచించారు. బ్యాంకుల వద్ద నగదు తీసుకొనే వారు, ఆభరణాల దుకాణాల వద్ద ఆభరణాలు కొనుగోలు చేసి వారిని అనుసరించి 50, 100 నోట్లు కింద పడవేసి వారి దృష్టి మరల్చి దొంగతనం చేస్తుంటారన్నారు. ఇప్పటికే కదిరి, నార్పల లాంటి చోట్ల ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

స్థలాన్ని పరిశీలించిన ఆర్డీఓ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని అక్కమ్మకొండ వద్ద ఉప్పర సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కళ్యాణ మండపం స్థలాన్ని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. స్థలానికి సంబంధించిన వివాదం చోటు చేసుకోవడంతో ఆర్డీఓ అక్కడికి చేరుకుని రెవెన్యూ రికార్డులు పరిశీలించారు. ఉప్పర సంఘం పేరిట 75 సెంట్ల భూమిని కొనుగోలు చేశామని ఆ సంఘం నాయకులు గోపాల్ రామచంద్ర అధికారులకు పత్రాలు చూపించారు. పూర్తి స్థాయి రికార్డులు, భూమి సర్వే జరిపే వరకు సంయమనం పాటించాలని ఆర్డీఓ వారికి సూచించారు.

చిత్రలింగేశ్వరస్వామికి క్షీరాభిషేకం



గోవు పాలతో తరలివెళుతున్న అర్చకులు

రొళ్ల: యాదవల ఆరాధ్యం దైవం చిత్రలింగేశ్వరస్వామికి అర్చకుల బృందం క్షీరాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం గంతికల్లు గొల్లహట్టికి చెందిన యాదవ కులస్తులు కాలినడకన సుమారు 40 కి.మీ దూరంలోని కర్ణాటక ప్రాంతం యరగుంట - లక్కనహళ్లి సమీపం వద్ద ఉన్న చిత్రలింగేశ్వరస్వామి ఆలయానికి బయలు వెళ్లారు. పూజల అనంతరం తిరిగి సోమవారం యత్తప్పస్వామి పూజలు చేసి ఉత్సవాలు ప్రారంభిస్తారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట

మడకశిర: నియోజకవర్గంలో అసాంఘిక కార్యకలాపాల నివారణకు రెండు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు రూరల్ సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో మట్కా, అక్రమ మద్యం, బెట్టింగ్, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టామన్నారు. రెండు నెలల్లో 20 కేసులు నమోదు చేసి దాదాపు 190 మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి నుంచి దాదాపు రూ.7 లక్షలు స్వాదీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అలాగే రెండు నెలల్లో 20 మట్కా కేసులను నమోదు చేశామన్నారు.

జగజ్జననికి జేజేలు



హిందూపురం: అన్నపూర్ణేశ్వరిగా చౌడేశ్వరీమాత



చిలమత్తూరు: మహాలక్ష్మి అలంకరణలో చౌడేశ్వరీదేవి



గోరంట్ల: వారాహిదేవి అలంకరణలో మల్లాలమ్మ

సాక్షిబృందం: శరన్నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు.



పెనుకొండ: లక్ష్మీ అలంకరణలో మహేశ్వరీదేవి



మడకశిర: వేరుశనగ కాయల అలంకరణలో వాసవీమాత



అమరాపురం: ప్రత్యేక అలంకరణలో చోళమాంబదేవి



గుడిబండ: గాయత్రీదేవిగా దర్శనమిస్తున్న మారెమ్మ



లేపాక్షి: లలితాదేవి అలంకరణలో దుర్గాదేవి



రత్నగిరిలో కూష్మాండదేవి అలంకరణలో అమ్మవారు

9లోగా మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవాలి

మడకశిర: నియోజకవర్గంలో మద్యం షాపులకు ఈనెల 9లోగా దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక ఎక్సైజ్ సీఐ ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. మడకశిర మున్సిపాలిటీలో 2, మడకశిర రూరల్ మండలంలో 2, అగళి, రొళ్ల మండలాల్లో ఒక్కొక్కటి, గుడిబండ, అమరాపురం మండలాల్లో రెండు చొప్పున మద్యం షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు రుసుం రూ. 2 లక్షల చొప్పున ఒక్కో షాపుకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు రుసుమును వెనక్కు ఇవ్వబోమన్నారు. ఈనెల 11న ఉదయం 8 గంటకు పుట్టపర్తిలో కలెక్టర్ సమక్షంలో మద్యం షాపులకు లాటరీ తీస్తామని చెప్పారు.

రత్నగిరిలో గుర్తు తెలియని మహిళ



రొళ్ల: రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయం ఎదురుగా ఉన్న కర్ణాటక రాష్ట్రం హొసకెరకు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని మహిళ (30)ను స్థానికులు గుర్తించారు. ఆమె మాట్లాడటం లేదని, కేవలం సైగలు మాత్రం చేస్తోందన్నారు. ఏఎస్ఐ బాలాజీ ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. కర్ణాటక రాష్ట్రం మిడిగేశి హోబళి వద్ద ఉన్న గొల్లహట్టి, హావేరి అని మాత్రమే మహిళ చెబుతోందన్నారు. మహిళ ఆచూకీ తెలుసుకునేందుకు కర్ణాటక పోలీసులకు సమాచారం ఇచ్చామని ఏఎస్ఐ తెలిపారు.